

రఘురామయ్య ఉపాధ్యాయవృత్తిలో పదవీ విరమణ చేసి అప్పుడే ఆర్నెల్లు పూర్తయ్యాయి. కానీ అతనికి రావలసిన ఫించను, గ్రాట్యుటీలు యింకా అందలేదు. వాటి కోసం రిటైరైన మర్నాటి నుంచి డి.ఇ.ఓ. ఆఫీసు చుట్టూ మూడు నెలలు కాలుకి బలపం కట్టుకొని తిరిగాడు. ఎలాగైతేనేం అక్కడ పని పూర్తిచేసి ఫైల్‌ని కలెక్టరేట్‌కి శాంక్షన్ కోసం పంపారు. అక్కడ ఆ ఫైలు సీటుకి వారం చొప్పున తిరుగుతూ పెన్షన్ విభాగం సూపరింటెండెంట్ రాఘవరావు టేబుల్ మీదకు వచ్చి నెలకిపైగా అయింది. కలెక్టర్ ఆఫీసుకు ఫైలు వెళ్లింది కాబట్టి యింక పెద్దగా యిబ్బందులుండవని రఘురామయ్య ఆలోచన.

రఘురామయ్య ఉపాధ్యాయ జీవితమంతా పల్లెల్లోనే గడిచిపోయింది. కొన్నాళ్లు అసిస్టెంట్‌గా, రిటైరయ్యే ముందు హెడ్మాష్టరుగా చేసి అందరి మన్ననలూ అందుకున్నాడు. అదృష్టవశాత్తు అతని పిల్లలంతా జీవితంలో స్థిరపడ్డారు. పెద్దకొడుకు రవి మల్టీనేషనల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఒక్కగానొక్క కూతురు వాణికి మంచి సంబంధాన్నే చేసాడు. అల్లుడు రవాణాశాఖలో పనిచేస్తున్నాడు. రెండో కొడుకు ఆనంద్‌కి ఈ మధ్యనే రెవెన్యూ శాఖలో ఉద్యోగం వచ్చింది.

గ్రాట్యుటీ డబ్బు చేతికొచ్చి, ఫించను డబ్బులు నెలనెలా చేతికొస్తూంటే శేషజీవితాన్ని తను పుట్టి పెరిగిన పల్లెటూళ్లో గడిపెయ్యాలని అతని ఆలోచన.

రఘురామయ్య నీతి నియమాలకు, నైతిక విలువలకూ ప్రాధాన్యతనిచ్చే వ్యక్తి. అన్యా

న్ని సహించనివాడు కూడా. అందుకే ఆ ఫించను ఫైలు ఆలస్యాన్ని అతను సహించలేకపోయాడు. ఆ రోజు ఆ విషయమై తాడో పేడో తేల్చుకోవాలని కలెక్టర్ ఆఫీసుకు వెళ్లాడు. అతనికి తెలిసిన ఒక గుమాస్తా ఆలస్యానికి కారణం రాఘవరావు అని చెప్పాడు. అతనికి దక్షిణ సమర్పించుకుంటేగానీ ఫైలు కదలదని, ఆ పనేదో త్వరగా చెయ్యమనీ ఉచితసలహా కూడా యిచ్చాడు.


అది విన్న మాస్టారి భృకుటి ముడివడింది. కనుబొమ్మలు అదిరాయి. ఈ వయసులో తను లంచం యివ్వడమా?! లంచం తీసుకోవడం ఎంత నేరమో యివ్వడం కూడా అంతే నేరం. తరువాత రాఘవరావుని కలిసి ఆ ఫైలు ఆలస్యానికి కారణం అడిగాడు. దాన్ని ఎన్నాళ్లు అలా ఉంచుకుంటారని ఆవేశంగా ప్రశ్నించాడు.

అది విని రాఘవరావు "నేను చెప్పేది వినండి మాస్టారూ! ఈ ఫైలు అసమగ్రంగా ఉంది. కావలసిన వివరాలు కొన్ని యిందులో లేవు. అందుకే దీన్ని మరలా డి.ఈ.ఓ. ఆఫీసుకు పంపాలి" అని తర్కంగా సమాధానమిచ్చాడు.

"ఆ పని వెంటనే చెయ్యొచ్చు కదండీ... ఫైల్ని మీ టేబుల్మీద నెలరోజులు పెట్టుకొని యిప్పుడా వివరాలు కావాలని అడగడం విడ్డూరంగా ఉంది". కొద్దిగా అసహనంగా అన్నాడు రఘురామయ్య. అప్పుడు రాఘవరావు రఘురామయ్య వైపు వంగి మెల్లగా అసలు విషయం చెప్పాడు.

మాస్టారి ముఖం ఎర్రబారింది.

ఆ తర్వాత జరగవలసిన పనులన్నీ చకాచకా జరిగిపోయాయి. ఆ సాయంత్రమే తన పని పూర్తి చేయడానికి వెయ్యిరూపాయల లంచం అడిగాడని, అదివ్వకపోతే ఆ ఫైల్ని వెనక్కి తిప్పి పంపిస్తానని బెదిరిస్తున్నాడనీ రాఘవరావు మీద అభియోగం మోపుతూ కలెక్టర్ గారికి ఒక వినతి పత్రాన్ని యిచ్చాడు రఘురామయ్య. రాఘవరావు జంకూ బొంకూ లేకుండా తనని లంచం అడగటాన్ని సహించలేకపోయాడు అరవయ్యో పడిలోపడ్డ ఆ వృద్ధమాస్టారు.



గన్నవరపు నరసింహమూర్తి

దాని ఫలితం రెండురోజులకు తెలిసింది. కలెక్టర్‌గారు సమగ్రంగా విచారణ జరిపి, రాఘువరావుని సస్పెండ్ చేసారు. రఘు రామయ్య గ్రాట్యుటీ, ఫించను ఆ మర్నాడే మంజూరయ్యాయి.

* * *

రెండు రోజుల తరువాత రఘురామయ్య పూజాదులు ముగించుకొని, పేపరు చదువుకుం టూండగా యింటిముందు ఆటో ఆగింది. అందులోంచి యిద్దరు వ్యక్తులు దిగారు. వస్తూనే రఘురామయ్యకి నమస్కారం చేసారు. అతను కూడా ప్రతి నమస్కారం చేసాడు ఒకింత ఆశ్చ ర్యపోతూ.

వాళ్లలో ఒకతను చెప్పడం ప్రారంభించా డు. మాస్టారూ?! నేను కలెక్టర్ ఆఫీసులో మేనే జర్‌గా పనిచేస్తున్నాను. ఈ జిల్లా యన్‌జీవో యూనియన్ ప్రెసిడెంట్‌ని కూడా. యితను మా కొలీగ్. యిప్పుడు మేమొచ్చింది మొన్న సస్పెండై న రాఘవరావు గురించి మాట్లాడటానికి".

రఘురామయ్యకి యిప్పుడు విషయం బోధ పడింది.

మళ్లీ అతనే "ఆ రోజు మీ పెన్షన్ విష యంలో అతనేదో మిమ్మల్ని డిమాండ్ చేయడం వల్ల మీకు కోపం వచ్చి ఫిర్యాదు చేయడం, తరువాత అతన్ని సస్పెండ్ చేయడం మీకు తెలి సిన విషయాలే. మీ విషయంలో అతను చేసింది నూటికి నూరుపాళ్లూ తప్పని మేమూ ఒప్పుకుం టున్నాము. కానీ కలెక్టర్‌గారు యిటువంటి విషయాలను చాలా సీరియస్‌గా తీసుకుంటా రు. అందుకే విచారణ తనే స్వయంగా చేప ట్టారు. బహుశా అతన్ని ఉద్యోగంలోంచి పూర్తి గా తొలగించవచ్చు కూడా" అన్నాడు.

"అతను చేసింది తప్పుకాదంటారా? లం చం తీసుకోవడం ఘోరమైన, నీచాతినీచమైన పనని అతనికి తెలియదా? నిజానికి అతను ఆ ఉద్యోగానికి అనర్హుడు. అతనికా శిక్ష పడ వలసిందే" రఘురామయ్య ఆవేశంగా అన్నాడు. అతను మాట్లాడుతున్నప్పుడు అతని పెదవులు వణకడాన్ని వాళ్లు గమనించారు.

"మాస్టారూ! మీరు కొంచెం శాంతించాలి. మీరు గౌరవనీయులైన ఉపాధ్యాయులు. ఎం దరో విద్యార్థులను మీరు తయారుచేసారు. మరెందరినో తప్పులుచేసిన వాళ్లని క్షమించి ఉంటారు. యిప్పుడు ఈ రాఘవరావుని కూడా పెద్దమనసుతో మీరు క్షమించాలి. లేకపోతే అతని కుటుంబం సర్వనాశనం అవుతుంది".

రఘురామయ్య వాళ్ల వంక ఆశ్చర్యంగా చూసాడు.

"అవును మాస్టారూ! రాఘవరావుది పెద్ద కుటుంబం. వయోవృద్ధులైన తల్లిదండ్రులతో పాటు పెళ్లికాని ముగ్గురు కూతుళ్లు, చదువు పూర్తయిన నిరుద్యోగ కొడుకులిద్దరినీ పోషించ వలసిన బాధ్యత అతనిదే. అదీగాక పెద్దకూతురి కి వచ్చే నెలలో పెళ్లికూడా. అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. యిప్పుడు సస్పెన్షన్ విషయం తెలిస్తే ఆ పెళ్లి తప్పిపోవచ్చు కూడా. ఆ పెద్ద కుటుంబాన్ని పోషించడానికే ఈ కక్కుర్తి. అతను సస్పెండైన దగ్గర్నుంచి ఆ యింట్లోవాళ్లు ఎవ్వ రూ భోజనం చెయ్యడం లేదు. బెంగతో యిల్లు దాటి బయటకు రావడం లేదు. అతను చేసిన పనిని మేము కూడా సమర్థించడం లేదు. మీరు పెద్దమనసుతో క్షమించి, అతనికి సహాయం చేస్తే అతని ఉద్యోగం మళ్లీ అతనికొస్తుంది. దీనివల్ల ఆ కుటుంబాన్ని రక్షించిన వాళ్లవుతారు".

"నేను సహాయం చేయడమా? ఎలా?"

"అవును మాస్టారూ! అతను సస్పెండ్ అయి

న తరువాత యూనియన్ తరపున మేము కలెక్టర్ గారిని కలిశాం. అతన్ని క్షమించి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరాం. అప్పుడాయన ఈ విషయంలో తానేమీ చేయలేనని, ఆ ఫిర్యాదు చేసిన మాస్టారు దాన్ని ఉపసంహరించుకుంటే అతన్ని తిరిగి విధుల్లోకి తీసుకుంటానని చెప్పారు. అందుకని మీరు పెద్దమనసుతో ఫిర్యాదుని ఉపసంహరించుకుంటే అతన్ని విధుల్లోకి తీసుకుంటారు. ఈ సహాయాన్ని అర్థించడానికే మీయింటికి కొచ్చాం".

సుదీర్ఘంగా అతను చెప్పిన మాటలు విన్న రఘురామయ్యలో మునుపటి ఆవేశం లేదు. దానిస్థానే జాలికలుగుతోంది.

కొద్దిసేపటి తరువాత అన్నాడు "నన్ను కొద్దిగా ఆలోచించుకోనివ్వండి. నాకు రెండురోజుల సమయం కావాలి".

వచ్చినవాళ్లు మరోసారి నమస్కారం చేసి వెళ్లిపోయారు.

* * *

రఘురామయ్యకి తన సొంత ఊళ్లో పూర్వీకుల యిల్లు ఉంది. రిటైరైన తరువాత ఆ యింటిని బాగు చేయించుకొని తను, భార్యా ఆ పల్లెలోనే శేషజీవితాన్ని గడిపెయ్యాలని అతని ఆలోచన. దాన్ని బాగుచేయించాలంటే కనీసం ఏభైవేల రూపాయలు కావాలి. ఆ మొత్తాన్ని ముందే తన భార్య పేరిట ఫిక్సెడ్ డిపాజిట్ చేసి ఉంచాడు. ఆ రోజే దాన్ని కాన్సిల్ చేసి త్వరగా ఆ యింటిని బాగు చేయించాలని అతని ఆలోచన. అందుకే వచ్చినవాళ్లు వెళ్లగానే భార్య విమలని పిలిచి, ఆ డిపాజిట్ పత్రాన్ని యిమ్మని చెప్పాడు. ఆమె కాఫీ అందిస్తూ అంది "మీరు కోపగించుకోనంటే ఓ విషయం చెబుతాను... మన ఆనంద్‌కి మొన్న వచ్చిన ఉద్యోగం కోసం ఆ డబ్బు ఖర్చయిపోయింది. మీకు చెబితే ఒప్పుకోరని పిల్లలు చెప్పొద్దన్నారు".

ఆనంద్ ఉద్యోగానికి ఖర్చయిందా? వాడు పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలో మెరిట్‌లో సెలెక్ట్ అయ్యాడు కదా విమలా! దానికి ఖర్చు ఏమిటి?"

"వాడు వ్రాతపరీక్షలో పాసైన సంగతే మీకు తెలుసు. పూర్తిగా సెలెక్ట్ కావాలంటే ఏభైవేలు అవసరం పడుతుందని, లేకపోతే ఆ ఉద్యోగం రాదనీ పెద్దవాడు హైదరాబాద్ నుంచి ఫోన్‌చేసి చెప్పాడు. ఆ విషయం చెబితే మీరొప్పుకోరని, వాడికి ఆ ఉద్యోగం ఎలాగైనా రావాలని ఆ ఫిక్సెడ్ డిపాజిట్‌ని క్యాన్సిల్‌చేసి నేనే ఆ డబ్బుని ఆనంద్‌కిచ్చి పంపించాను. ఈసారిగానీ ఉద్యోగం రాకపోతే వాడికి ఏజ్‌బార్ అవుతుందని అలా చేసాను. ఈ విషయం మీకు చెప్పనందుకు క్షమించండి..."

కంటనీరు తుడుచుకుంటూ భార్య చెప్పిన మాటలు విన్న రఘురామయ్యకు నోటమాట రావట్లేదు. కొద్దిసేపు మాటలురాని మూగవానిలా చేష్టలుడిగి సోఫాలో కూర్చుండిపోయాడు.

ఆ సాయంత్రం అతన్ని చూడటానికి పెద్ద కొడుకు రవి, కూతురు వాణి హైదరాబాద్ నుంచి వచ్చారు.

* * *

వేసవి కావడంతో ఆ రాత్రి రఘురామయ్య డాబామీద పడుకొని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వాళ్లకు తను రెండు రోజుల సమయం యిచ్చాడు. ఏంచెయ్యాలో తోచక అతనికి నిద్రరావట్లేదు. యింతలో పెద్దకొడుకు రవి, కూతురు వాణి డాబామీదకు వచ్చారు. భోజనాలు పూర్తవడంతో పిచ్చాపాటి మాట్లాడుకుందుకు వచ్చారు అక్కడికి. తండ్రి పడుకున్నాడనుకొని వాళ్లు

మాట్లాడుకోసాగారు.

"చెల్లీ! ఏమిటి విషయాలు? ఈ మధ్య ఆఫీసు పనుల్లోపడి బిజీ అయిపోయాను. అదీకాక నీకు తెలుసు కదా... ఈమధ్య యిల్లొకటి మొదలెట్టాను. ముందు దాని అంచనా ముప్పైలక్షలని ప్రారంభిస్తే అదిప్పుడు ఏభైలక్షలయ్యేటట్లుంది. అదొక టెన్షన్. అందుకే మీయింటికి రావటం కుదర్లేదు. నువ్వైనా రావచ్చు కదే..."

"నీకు తెలుసుకదరా పిల్లల స్కూళ్లతో క్షణం తీరకుండా ఉంది. అందుకే రిటైరైన తరువాత యిప్పుడు నాన్నగారిని చూడటానికి రావడానికి కూడా యింటి దగ్గర మా అత్తగార్ని ఉంచవలసి వచ్చింది".

"అది సరే! బావగారెలా ఉన్నారు? యిప్పుడు సీటుబాగుందా? సంపాదనెలా ఉంది? ఆ మధ్యన మీ ఆయనకు నెలకు ఏభైవేలకు పైగా వచ్చేదట కదా?! కొత్తగా ఏమేం కొన్నారు?" ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు రవి.

"ఆ విషయం గురించే చిన్న అవసరం పడి యిక్కడి కొచ్చానురా! నువ్వు చెప్పినట్లు ఆ మధ్యన సీటుబాగుండి మీ బావగారి సంపాదన బాగుండేది. అందుకే ముప్పై లక్షలు పెట్టి యిల్లొకటి కట్టించాం. కానీ గిట్టనివాళ్లెవరో యితను బాగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని వాళ్ల కమీషనర్‌కి ఫిర్యాదు చేయడంతో మూణ్ణెల్ల క్రితం ఈయన్ని సీటు మార్చేశారు. యింటి బకాయి పదిలక్షలు త్వరగా యిమ్మని బిల్డర్ ఒకటే పోరు పెడుతున్నాడు. యిప్పుడు మళ్లీ పాత సీటు కావాలంటే ఐదులక్షలు ఖర్చవుతుందిట. మినిష్టర్ గారి పియ్యేతో మాట్లాడారు. మళ్లీ సీటుమారితేగానీ మా యిబ్బందులు తీరేటట్లు లేవు. ఉట్టి జీతంతో ఏం బ్రతుకుతాం చెప్పు? అందుకే నాన్నగారు రిటైరయ్యారు కదా! ఆ డబ్బులొస్తే ఓ మూడు లక్షలు సర్దుతారేమోనని అడగటానికి వచ్చాను. కానీ అడగటానికి సిగ్గేస్తోంది. నాన్నగారి సంగతి నీకు తెలుసు కదా" సుదీర్ఘంగా ఆమె బాధలు చెప్పుకుపోతోంది వాణి.

ఆ మాటలు వింటున్న రఘురామయ్య మస్తిష్కం మొద్దుబారిపోయింది. వీళ్లు తన పిల్లలేనా? అన్న సందేహం కలుగుతోంది ఆయనకు. మళ్లీ వాళ్ల మాటలు వినబడసాగాయ్.

"నువ్వేంట్రా యిలా వచ్చావ్?! నాన్నగారిని చూడాలనేనా? యింకేదైనా పనిమీద వచ్చావా"?

"రెండూనే. నాన్నగారితో చిన్న అవసరం పడింది. మాది అమెరికన్ బేస్డ్ మల్టీనేషనల్ కంపెనీ కదా. వాళ్లు హైదరాబాద్‌లో ఒక డ్రగ్స్ తయారుచేసే యూనిట్‌ని ప్రారంభిద్దామనుకుంటున్నారు. దాంతో పాటు పెస్టిసైడ్స్ కూడా.

దానికి లేండ్‌తో సహా అన్ని క్లియరెన్సెస్ వచ్చేసాయి. కానీ పొల్యూషన్ కంట్రోల్‌వాళ్లు క్లియరెన్స్ యివ్వట్లేదు. ఆ డిపార్ట్‌మెంట్‌ని మేనేజ్‌చేసి పర్మిషన్ వచ్చేటట్లు చూడమని, అవసరమైతే ఎంత డబ్బైనా యిచ్చి ఆ పని పూర్తి చెయ్యమనీ మా కంపెనీ వాళ్లు ఆ ఎసైన్‌మెంట్ నాకు అప్పజెప్పారు. అందుకు కావలసిన ఐదు లక్షలు కూడా నాకు యిచ్చారు అవసరమైతే ఎవరికైనా యివ్వడానికి".

"అయితే పని అయిపోతుందిలే. అంత డబ్బిస్తే పనెందుకు కాదు?" మధ్యలో కల్పించుకొని అంది వాణి.

"వాళ్లకి యివ్వడం సమస్యకాదు. ఈ మధ్యనే నాకు తెలిసింది ఆ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఒక మెంబర్ ఒకప్పటి నాన్నగారి శిష్యు

డట. అందుచేత నాన్నగారి చేత అతనికి చెప్పిస్తే ఆ పని పైసా ఖర్చులేకుండా పూర్తవుతుంది. కంపెనీ వాళ్లిచ్చిన ఆ డబ్బు నాదైపోతుంది. దాంతో నా యిల్లు కూడా పూర్తయిపోతుంది. అందుకే నాన్నగారితో ఆ విషయం మాట్లాడదామని వచ్చాను. కానీ ఆయనకు ఎలా చెప్పాలో నాకర్థం కావట్లేదు. అందుకు నాన్నగారు ఒప్పుకుంటారా అని నా సందేహం!".

రవి మాటలు రఘురామయ్య చెవిని అలలు అలలుగా సోకుతున్నాయి. తన పిల్లలు చాలా ఎదిగిపోయారు. నైతిక విలువలకు పూర్తిగా తిలోదకాలిచ్చేసారు. తప్పు చెయ్యడం వాళ్ల దృష్టిలో యిప్పుడు తప్పుకాదు. పైగా అది అవసరం కూడా. తాము ఎదగడానికి ఎన్ని అక్రమమార్గాలు తొక్కడానికైనా వాళ్లు వెనుకాడడం లేదు. తన పిల్లలందరూ స్వచ్ఛతకు మారు పేరనుకున్నాడు. తన యింట్లోవాళ్లు యింత ఘోరమైన తప్పులు చేస్తూ ఉంటే తాను పెద్ద ధర్మరాజులా అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసాడు. దానికి తనకు అర్హత ఉందా?

అతనిలో అంతర్మథనం మొదలైంది. రేపు తనేం చేయాలో ఒక నిర్ణయానికొచ్చాడు. తరువాత అతనికి గాఢనిద్ర పట్టేసింది.

* * *

ఇది జరిగి ఆర్నెల్లవుతోంది. ఆ మర్నాడు యూనియన్ వాళ్లు కోరినట్లు నా ఫిర్యాదుని వెనక్కి తీసుకోలేదు. తప్పుచేసినవాడు ఎంతటివాడైనా - నా పిల్లలైనా సరే శిక్షించబడాలన్నది నా సిద్ధాంతం. వాళ్లు మాయింటికి వచ్చి ఎంత ప్రాధేయపడ్డా నేను సున్నితంగా తిరస్కరించాను.

నాలో నా కుటుంబం పట్ల ఏహ్యాభావం ఏర్పడింది. అందుకే మాపెద్దవాడు రవి కోరిన సహాయం చెయ్యడానికి నేను ఒప్పుకోలేదు. అటువంటివి ప్రోత్సహించనని ఖరాఖండిగా చెప్పేశాను. అలాగే మా అమ్మాయి వాణి అడిగిన డబ్బు కూడా యివ్వలేదు. నా భార్యతో సహా పిల్లలందరూ నా ఆశయాలను తుంగలో తొక్కారు. ఆ కోపంతోనే నా భార్య విమలని కూడా రావద్దని నేనొక్కణ్ణే ఈ పల్లెటూరికి వచ్చేసాను. పిల్లలెవర్నీ నా దగ్గరకు రావద్దని తెగేసి చెప్పాను" ఆవేశంగా తన మిత్రుడు గోపాలంతో జరిగినవన్నీ వివరంగా చెబుతున్నాడు రఘురామయ్య.

గోపాలం కూడా హెడ్మాష్టరుగా చేసి రఘురామయ్యతోపాటే పదవీ విరమణ చేసాడు. మిత్రుణ్ణి చూసి పోదామని ఆపల్లెకొచ్చాడు.

"ఆ తరువాత పదిరోజులకి విమల తన తప్పుని దిద్దుకొని యిక్కడికొచ్చింది. మా రెండో అబ్బాయి ఆనంద్ తను లంచం యిచ్చి సంపాదించిన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఒక ప్రైవేట్ కంపెనీలో జాయిన్ అయ్యాడుట" రఘురామయ్య చెబుతూంటే మధ్యలో గోపాలం కల్పించుకొని... "వాళ్లని రావద్దనడానికి నీకు హక్కు లేదురా. మనమా పాతకాలం మనుషులం. వాళ్లు ఈ కాలానికి ప్రతినిధులు. ఈ యుగసంధిలో మనమే యిమడ లేకపోతున్నాం. అది మన తప్పు" అన్నాడు.

"ఏమోరా! అలా చేస్తే కొన్నాళ్లకైనా వాళ్లలో మార్పొస్తుందని నా ఆశ. ఆ కలుపు మొక్కల్ని వేరుచెయ్యాలి. అదే నా ఉద్దేశ్యం. యిక అది తప్పా, ఒప్పా అన్నది కాలమే చెబుతుంది" రఘురామయ్య గొంతులో భవిష్యత్‌పై ఆశ...

దూరంగా ఏటి ఒడ్డునున్న శివాలయంలోని గుడి గంటలు విరామం లేకుండా మోగుతున్నాయి... రఘురామయ్య ఆశయాలను సమర్థిస్తున్నట్లుగా. ●